# సాక్షి వికారాబాద్

మంగళవారం : 2 : జనవరి : 2024






## చలితో జాగ్రత్త

జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఇంట్లో కూర్చున్నా చలి వణికిస్తోంది. 8లో▸



## 'యంత్రలక్ష్మి' ఎక్కడమ్మా..!

సాగులో ఆధునిక యంత్రాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం అటకెక్కింది. 8లో▸



## పవిత్ర జాతర..

కోర్కెలు తీర్చే మామిడికుంట ఆంజనేయ స్వామి జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. 9లో▸

## న్యూస్‌రీల్

### గవర్నర్, సీఎంను కలిసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



గవర్నర్‌కు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, (చిత్రంలో) సీఎం రేవంత్‌రెడ్డి

**తాండూరు టౌన్:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తోపాటు, సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ఆయన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

### 47మందిపై కేసులు

**అనంతగిరి:** నూతన సంవత్సరం సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన 47 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పెషల్ టీంలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టీంలు ఏర్పాటు చేసి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

**వేడుకల్లో ఘర్షణ, ఆరుగురిపై కేసు**

**యాలాల:** కొత్త సంవత్సర వేడుకల్లో జరిగిన ఘర్షణలో ఆరుగురిపై యాలాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని చావిడి సమీపంలో ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన పలువురు యువకులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు అకారణంగా దూషిస్తూ గొడవకు దిగి దాడి చేశారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. గొడవకు కారణమైన కొప్పుల యాదప్ప, సిద్రాల శ్రీనివాస్, నాగారం పాండు, ఉప్పరి యాదప్ప, బాల్‌రాజ్, దుర్కి నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### స్పీకర్‌ను కలిసిన బాల్యమిత్రులు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బాల్యమిత్రులు

**తాండూరు రూరల్:** వికారాబాద్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సోమవారం తాండూరుకు చెందిన బాల్యమిత్రులు కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గౌతాపూర్ సర్పంచ్ రాజప్ప గౌడ్, కిష్టయ్య, సుదర్శన్, గొడి వెంకటేశం, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

### నూతన ఎన్నిక



శెట్టి శివకుమార్

**ఇబ్రహీంపట్నం:** రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సెంట్రల్ కమిటీ మెంబర్‌గా ఇబ్రహీంపట్నానికి చెందిన శెట్టి శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ కమిటీ చైర్మన్ శివరత్నం, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. ఆ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేసిన శివకుమార్‌ను సెంట్రల్ కమిటీ సభ్యుడిగా తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శెట్టి శివకుమార్ మాట్లాడుతూ.. ఈ లోక్‌సభ ఎన్నికల లోపు లింగబలిజ కులస్తులను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తమ సంఘం ఆవిర్భవించి పదేళ్లు గడిచిన సందర్భంగా హైదరాబాద్‌లో దశాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నిరంగాల్లో వెనుకబడిన వీరశైవ లింగబలిజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు సహకరించాలన్నారు. సంఘం అభ్యున్నతికి తన శాయశక్తులా కృషిచేస్తానన్నారు.



బొంరాస్‌పేట: నూతన సంవత్సర వేడుకల్లో యువకుల సందడి

# 'న్యూ' జోష్

జిల్లాలో కొత్త సంవత్సరం వేడుకలు అంబరాన్నంటాయి. డిసెంబర్ 31న అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసి 2024కు ఘనంగా స్వాగతం పలికారు. యువత ప్రధాన కూడళ్లల్లో డాన్సులు చేస్తూ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొట్టారు. సోమవారం ఉదయం నుంచి ఆలయాలు జనంతో కిటకిటలాడాయి. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని నేతలు ఆకాంక్షించారు.



అనంతగిరిలో యువత కోలాహలం

# అర్జీలు @ 46,778

## 'ప్రజా పాలన'కు విశేష స్పందన

- రెండు రోజుల్లో భారీగా దరఖాస్తులు
- తాండూరులో అత్యధికంగా..
- రేషన్‌కార్డు లేని వారూ దరఖాస్తులు ఇవ్వొచ్చు



ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి (ఫైల్)

**వికారాబాద్:** పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ప్రతి గడపకూ సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇచ్చిన విషయం తెలిసిందే. హస్తం ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అభయహస్తం పేరిట గ్యారంటీలను అమలుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆరు గ్యారంటీల్లో ఐదింటికి అర్జీలు తీసుకుంటున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. అయితే దరఖాస్తు చేసుకునేందుకు వెళుతున్న ప్రజలు అనేక సందేహాలు, అపోహాలు వ్యక్తం చేస్తున్నారు.

**దరఖాస్తుల వెల్లువ**

ప్రజాపాలన కార్యక్రమానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 20 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 565 గ్రామ పంచాయతీలు, 98 మున్సిపల్ వార్డుల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రెండు రోజుల పాటు 203 గ్రామ పంచాయతీల్లో 15 మున్సిపల్ వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో 1,94,956 కుటుంబాలు ఉండగా రెండు రోజుల్లో 46,778 దరఖాస్తులు వచ్చాయి. వికారాబాద్ నియోజకవర్గంలో 11,896 దరఖాస్తులు, పరిగి నియోజకవర్గంలో 11,114, కొడంగల్ నియోజకవర్గంలో 6,514 దరఖాస్తులు, తాండూరు నియోజకవర్గంలో 15,548 దరఖాస్తులు, చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోకి వచ్చే నవాబుపేట మండలంలో 1,706 దరఖాస్తులు వచ్చాయి.

**అనుమానాలు, అపోహలు..**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజల నుంచి అనేక అనుమానాలు, అపోహలు వ్యక్తమవుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలతో పాటు మహిళలు, అల్పసంఖ్యాక వర్గాలు, ప్రత్యేక ప్రతిభావంతుల కోసం ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వస్తున్నాయి. తెల్లరేషన్ కార్డులు ఉన్న కుటుంబాలకే ఎక్కువగా ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. అయితే అర్హులైన కొన్ని వేల కుటుంబాలకు తెల్లరేషన్ కార్డులు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ముందుగా కార్డులు ఇవ్వకుండా పథకాల కోసం దరఖాస్తులు ఎలా స్వీకరిస్తారని పేదలు ప్రశ్నిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలుకు ఏ ప్రాతిపదిక అర్హత నిర్ణయిస్తారో చెప్పకుండా అర్జీలు తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తు ఫారంలో ఆధార్ కార్డు నంబరు, రేషన్ కార్డు నంబరు రాయాలని సూచించారు. రేషన్ కార్డులు లేనివారు ఏమి రాయాలనే విషయాన్ని పొందుపరచలేదు. కార్డు ఉందా లేదా అనే ఆప్షన్ కూడా ఇవ్వలేదు. పింఛన్ల కోసం ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే వారు దరఖాస్తు చేసుకోవచ్చా..? ప్రభుత్వ ఉద్యోగులు ఉన్న కుటుంబసభ్యులు సైతం పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చా..? తదితర ప్రశ్నలు దరఖాస్తుదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### అపోహాలు వద్దు



ప్రజాపాలన కార్యక్రమంపై ఎలాంటి అపోహాలు వద్దు. అసత్య ప్రచారాలను నమ్మొద్దు. 6వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటాం . కార్యక్రమం ముగిసిన తరువాత అర్హులు ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లకు దరఖాస్తులు ఇవ్వొచ్చు. రేషన్ కార్డులు లేని వారు ఎలా అనే అపోహాలు వద్దు. దరఖాస్తు ఫారంలో రేషన్ కార్డు నంబరు అడిగిన చోట నో (కార్డు లేదు) అని రాస్తే సరిపోతుంది. రేషన్ కార్డు లేని వారు దరఖాస్తు ఫారంతోపాటు తెల్ల కాగితంపై రాసి ఇచ్చినా మా సిబ్బంది తీసుకుంటారు. ఆ దిశగా ఆదేశాలు ఇచ్చాం. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి నాలుగు నెలలకు ఒక్కసారి ప్రజాపాలన నిర్వహించాలని నిర్ణయించారు.

– నారాయణరెడ్డి, కలెక్టర్

# స్వాభిమాన పోరాటాలకు..



విజయోత్సవ ర్యాలీలో దళిత, ప్రజా సంఘాల నాయకులు

## స్ఫూర్తి 'భీమా కోరెగావ్'

- దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ

**కొడంగల్ రూరల్:** దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భీమా కోరెగావ్ 206వ శౌర్య దివస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్ కాలనీ నుంచి ప్రధాన వీధుల మీదుగా ఆట, పాటలతో విజయోత్సవ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యూ రమేష్‌బాబు, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ మార్నింగ్ కమిటీ మెంబర్ దస్తప్ప మాట్లాడారు. దేశ మూలవాసి ప్రజలను నీచమైన బానిసత్వానికి గురిచేసిన పీష్వా బ్రాహ్మణులపై పోరాట యోధులు చేసిన యుద్ధ విజయానికి చిహ్నమే భీమా కోరేగావ్ అని కొనియాడారు. స్మారక స్థూపానికి పూలదండలు వేసి అమరులైన మహర్ వీరులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జై భీమ్ యూత్ అధ్యక్షుడు సాయికుమార్, యువజన సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు దాము, కృష్ణ, దప్పు శ్రీనివాస్, దేవనూర్ కృష్ణ, ప్రవీణ్, ఉడిమేశ్వరం వెంకట్, రావులపల్లి హనుమంతు, కుప్పగిరి సాయిలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేయండి

- ఎస్పీ కోటిరెడ్డి

**అనంతగిరి:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పోలీసు అధికారులుసోమవారం ఎస్పీ కోటిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈ ఏడాది కూడా జిల్లాలో ప్రశాంత మైన వాతావరణంలో పనిచేస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు మురళీధర్, రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి



పద్మనాభుడి దర్శనం కోసం క్యూలో వస్తున్న భక్తులు

# అనంతగిరికి భక్తుల తాకిడి

**అనంతగిరి:** వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్ట అనంత పద్మనాభస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు వేలాదిగా తరలిరావడంతో గంటల తరబడి క్యూలో ఉండాల్సి వచ్చింది. స్వామివారి దర్శ న అనంతరం ఆలయ పరిసరాల్లో విహరించారు. సమీప అడవిలో కాలక్షేపం చేస్తూ సంతోషంగా గడిపారు.




స్వామివారి సన్నిధిలో భక్తులు

# 'మెగా' ఆశలు

## తెరపైకి టీచర్ పోస్టుల భర్తీ

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- పుస్తకాలు తిరగేసే పనిలో అభ్యర్థులు
- కోచింగ్ సెంటర్లకు పరుగులు



**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** మెగా డీఎస్సీ ప్రకటన నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆశలు చిగురింపజేస్తోంది. ఆరేళ్లుగా ఉపాధ్యాయ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఫలితంగా ఖాళీల సంఖ్య భారీగా పెరిగిపోయింది. తాజాగా ప్రభుత్వం మెగా డీఎస్సీ అంశాన్ని తెరపైకి తేవడంతో ఇప్పటికే బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసి.. ఏళ్ల తరబడి ప్రభుత్వ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు మళ్లీ పుస్తకాలను తిరగేసే పనిలో పడ్డారు. ఎలాగైనా ఈసారి జాబ్ చేజిక్కించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. సీఎంకు పైరవీల ద్వారా అడ్డదారుల్లో, అక్రమంగా ఇక్కడికి వచ్చిన వారిని తిప్పి పంపడం ద్వారా ఏర్పడిన ఆయా ఖాళీలను డీఎస్సీ ద్వారా మళ్లీ భర్తీ చేయొచ్చనే భావనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

**20 వేలకుపైగా నిరుద్యోగులు**

రంగారెడ్డి జిల్లాలో 1,263 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో ప్రస్తుతం 6,919 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 2017 తర్వాత ఇప్పటి వరకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ వెలువడలేదు. జిల్లాలో బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసిన వారు 20 వేల మందికి పైగా ఉన్నట్లు అంచనా. వీరంతా ఏళ్ల తరబడి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ తాజా ప్రకటనతో మళ్లీ కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటి వరకు చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలకు సెలవు పెట్టి పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు జిల్లాలో 4,722 మందికిపైగా ఉపాధ్యాయులు ఏళ్ల తబడి ఒకేచోట పని చేస్తున్నట్లు సమాచారం. వీరంతా ఇప్పటికే బదిలీ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ మధ్య లోనే నిలిచిపోయింది. 317 జీఓకు విరుద్ధంగా 400 మందికి పైగా స్థానికేతరులు జిల్లాలోనే ఉన్నారు. వీరందరినీ ఆయా సొంత జిల్లాలకు తిప్పి పంపడం ద్వారా మరిన్ని ఖాళీలను సృష్టించి, స్థానిక నిరుద్యోగులతో వాటిని భర్తీ చేసే అవకాశాన్ని సైతం ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

**టీఆర్‌టీ దరఖాస్తులపై లేని స్పష్టత**

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మొదట్లో డీఎస్సీ (డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ) నిర్వహించేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత డీఎస్సీని రద్దు చేసి, దాని స్థానంలో టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) తీసుకొచ్చింది. గత సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో మొత్తం 823 పోస్టులను ఖాళీగా చూపించింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, పీఈటీ, భాషా పండితుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 358 పోస్టులు, మేడ్చల్ జిల్లా పరిధిలో 78, రంగారెడ్డి జిల్లా పరిధిలో 196, వికారాబాద్ జిల్లా పరిధిలో 191 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించింది. వాస్తవ ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్‌లో చూపించిన పోస్టులకు పొంతనే లేకుండాపోయింది. అడ్డదారుల్లో వచ్చిన ఉపాధ్యాయులను తిప్పి పంపడం ద్వారా ఏర్పడే ఖాళీలను కూడా భర్తీ చేసే ఆలోచన ఉంది. అయితే, ఇప్పటికే టీఆర్‌టీ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, పరీక్ష కోసం ఎదురు చూస్తున్న వారు మళ్లీ కొత్త ప్రభుత్వం ప్రకటించే డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉందా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

**టీఆర్‌టీ నోటిఫికేషన్‌లో చూపిన ఖాళీలు ఇలా..**

| జిల్లా | స్కూల్ అసిస్టెంట్ | భాషాపండితులు | పీఈటీలు | ఎస్‌జీటీలు |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 116 | 57 | 22 | 163 |
| రంగారెడ్డి | 48 | 25 | 06 | 117 |
| మేడ్చల్ | 25 | 07 | 01 | 45 |
| వికారాబాద్ | 102 | 12 | - | 77 |

**'సేవ్ రంగారెడ్డి'**

జీఓ 317తో జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని తొర్రూరులోని క్యాంప్ ఆఫీసులో కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. 317 జీవో అడ్డుపెట్టుకొని జిల్లాకు వచ్చిన ఇతర జిల్లాల ఉపాధ్యాయులతో స్థానిక ఉపాధ్యాయులకు పదోన్నతుల్లోనే కాదు బదిలీల్లోనూ తీవ్రమైన అన్యాయం జరిగిందని, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించకపోవడంతో రిజర్వేషన్ వర్గాలు వారి రిజర్వేషన్లలో ప్రమోషన్లు నష్టపోతున్నారని, స్థానిక జిల్లా నిరుద్యోగులు శాశ్వతంగా ఉద్యోగం కోల్పోయే పరిస్థితి వచ్చిందని విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

## క్లుప్తంగా

### కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి



వికసిత్‌ భారత్‌ కార్యక్రమం గురించి వివరిస్తున్న నేతలు

కుల్కచర్ల: పేదల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కుల్కచర్ల మండల బీజేపీ అధ్యక్షుడు మైపాల్‌ ముదిరాజ్‌ అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల, సాల్వీడు గ్రామాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ మేనేజర్‌ సతీశ్‌ ఆధ్వర్యంలో వికసిత్‌ భారత్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న పథకాలను గ్రామీణ ప్రజలకు తెలిపేందుకే వికసిత్‌ భారత్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాల్వీడు గ్రామ సర్పంచ్‌ బాలయ్య, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి సంగెం శ్రీను, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైపాల్‌ యాదవ్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ వెంకట్‌, రాజునాయక్‌, నర్సింహులు, రమేశ్‌, భీమమ్మ, సిరి, లక్ష్మణ్‌ నాయక్‌, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ‘కొత్త దినం’ చేదుగా..

బొంరాస్‌పేట: నూతన సంవత్సరం మొదటి రోజు ఓ యువతీయువకుడికి చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరిద్దరూ బైక్‌పై పరిగి నుంచి కొడంగల్‌కు బైక్‌ వెళ్తున్నారు. రేగడి మైలారంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న గ్యాస్‌ సిలిండర్ల వాహనం, బైక్‌ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో వెనక కూర్చున్న యువతి ఎడమకాలు విరిగింది. యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్‌ చేసి కొడంగల్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌ తరలించామని వైద్యులు చెప్పారు.

### విద్యుదాఘాతంతో మేకలు మృత్యువాత



మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న సర్పంచ్‌ రాజిరెడ్డి

దోమ: విద్యుత్‌ షాక్‌తో రెండు మేకలు మృతి చెందాయి. ఈ ఘటన దోమ మండల పరిధిలోని ఉదన్‌రావుపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఉదన్‌రావుపల్లి గ్రామానికి చెందిన గొల్ల ఎల్లయ్యకు చెందిన మేకలు మేతకు వెళ్లాయి. మేకలు మేస్తూ కంచెలేని విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి.. షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న స్థానికులు ఎల్లయ్యకు సమాచారమిచ్చారు. మేకలు మృతి చెందడంతో ఆయన కన్నీటి పర్యంతమయ్యాడు. మృతి చెందిన రెండు మేకల విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఎల్లయ్యకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటానని స్థానిక సర్పంచ్‌ రాజిరెడ్డి భరోసా ఇచ్చాడు.

### కళాబృందానికి ‘పద్మజ్యోతి’

బొంరాస్‌పేట: ఒగ్గుడోలు కళాకారులు దశాబ్దాలుగా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ కళకు జీవం పోస్తున్నారు. మండల పరిధిలోని నాందార్‌పూర్‌కు శ్రీ మల్లికార్జున ఒగ్గు కళాసేవా సమితి కళాబృందం పద్మజ్యోతి అవార్డు–2024 అందుకుంది. 2017 నుంచి ఆరేళ్లలో వివిధ రాష్ట్రాల్లో ఎన్నో ప్రదర్శనలిచ్చి అబ్బురపర్చారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అవార్డు ప్రధానోత్సవంలో నల్గొండ ఎంపీ లింగయ్య యాదవ్‌, డీసీపీ బురాన్‌అలీ, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ చేతుల మీదుగా కళాకారులు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు శివ, రాఘవేందర్‌, మల్లేశ్‌, భద్రయ్య, నరేశ్‌, నవీన్‌, రామకృష్ణ, రాకేశ్‌, శివరాజ్‌, రాజు, రాములు, మహేశ్‌, సాయి, అరవింద్‌ పాల్గొన్నారు.



# చలితో జాగ్రత్త

- ప్రబలుతున్న వ్యాధులు
- కొత్త వైరస్‌ గుబులు
- చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి
- హెచ్చరిస్తున్న వైద్యనిపుణులు



చలి మంటలు కాచుకుంటున్న యువకులు

పరిగి: జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఇంట్లో కూర్చున్నా చలి వణికిస్తోంది. బయట అడుగుపెట్టాలంటే ప్రజలు గజగజలాడుతున్నారు. చలితో దీర్ఘకాలిక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్‌ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీనికితోడు దగ్గు, జలుబు, ఆయాసం, ఫ్లూ, జ్వరం కేసులు పెరుగుతున్నాయి. ఇదే సమయంలో కొత్తగా జేఎన్‌ వన్‌ వేరియంట్‌ రూపంలో వైరస్‌ విస్తరిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చలిగాలుల వలన పగటి పూట ఉష్ణోగ్రత 28 డిగ్రీలు నమోదవుతున్నా.. రాత్రి అయ్యే సరికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడతోంది. సాయంత్రం ఆరు దాటిందంటే ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. గ్రామీణ, పట్టణాలు తేడా లేకుండా ప్రజలు చలి మంటలను ఆశ్రయిస్తున్నారు.

**పడిపోతున్న ఉష్ణోగ్రత్తలు**

పొగమంచుతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా చిన్న, పెద్దా తేడా లేకుండా వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వం కూడా హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలో కొత్త వేరియంట్‌ విస్తరిస్తుండటంతో పాటు, చలి ఎక్కువగా ఉండడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ సీజన్‌లో చలితో పాటు తుఫానుల ప్రభావంతో వ్యాధులు విజృంభిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

**జాగ్రత్తలు తప్పనిసరి**

ప్రస్తుతం జేఎన్‌ వన్‌ వేరియంట్‌ విస్తరిస్తోందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి, శ్వాస సంబంధించిన సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్య ఆరోగ్య శాఖ సూచిస్తోంది. ఇలాంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలు చలి గాలులు వీస్తున్న సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**వైద్యుల సలహాలు పాటించాలి**



ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల వలన ప్రతి ఒక్కరికీ సీజనల్‌ వ్యాధులు వస్తుంటాయి. వైద్యుల సూచనలను తప్పకుండా పాటించాలి. చలి తీవ్రంగా ఉన్నప్పుడు వృద్ధులు, చిన్న పిల్లలు బయటకు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. చలి, గొంతునొప్పి, తల నొప్పి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

– మాధురి, వైద్యురాలు

## దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

- చెరువులో పడిన ఆటో
- బాలుడి పరిస్థితి విషమం



ప్రమాదంలో గాయపడ్డ బాలుడు, వృద్ధురాలు

తాండూరు రూరల్‌: తాండూరు పట్టణ శివారులోని మల్‌రెడ్డిపల్లి చెరువులో ఓ ఆటో బోల్తా పడింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వికారాబాద్‌ జిల్లా దోమ మండలం రాయికొండ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ తన ఆటోలో కుటుంబీకులు, బంధువులతో కలిసి తాండూరు మండలం అంతారం తండాలో ఉన్న భూకైలాస్‌ ఆలయానికి వచ్చారు. దర్శనం అనంతరం ఇంటికి వెళ్తుండగా అంతారం తండా– మల్‌రెడ్డిపల్లి మధ్యలో ఉన్న చెరువులో ఆటో పడింది. వెంటనే స్థానికులు చెరువులో పడిన భక్తులను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ శ్రీనివాస్‌ కుమారుడు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్‌కు తీసుకెళ్లారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

## కరాటే పోటీల్లో సత్తా చాటిన మహేశ్‌

తలకొండపల్లి: ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని కరాటే మాస్టర్‌ మహేశ్‌ గోల్డ్‌ మెడల్‌ సాధించాడు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన మహేశ్‌ మాస్టర్‌ కరాటే అకాడమీలో శిక్షణ ఇస్తున్నాడు. ఈ శిక్షణ తీసుకున్నవారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. 2023 డిసెంబర్‌ 31న ఢిల్లీ తాజ్‌ హోటల్‌లో నిర్వహించిన పోటీల్లో నేపాల్‌, జపాన్‌, మలేషియా, ఆఫ్ఘనిస్తాన్‌ తదితర దేశాల నుంచి 300 మంది పాల్గొనగా మన రాష్ట్రం నుంచి ముగ్గురు తలపడ్డారు. మహేశ్‌ ఫైట్‌లో గోల్డ్‌ మెడల్‌, కటాఫ్‌లో సిల్వర్‌ మెడల్స్‌ను సాధించాడు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయి కరాటే నిర్వాహకులు మహేశ్‌కు మెడల్స్‌, ప్రశంసా పత్రం, సర్టిఫికెట్‌లను అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టోర్నమెంట్‌ అకాడమీ ఆర్గనైజర్‌ సుజీత్‌ చారి, బ్లాక్‌ బెల్టు సతీశ్‌, కలర్‌ బెల్టు అంజలి, మాస్టర్స్‌, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

**త్వరలో తాపీ మేస్త్రీ సంఘం భవన నిర్మాణం**

- షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కట్టుబడి ఉందని షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. సోమవారం ఆయన తాపీ మేస్త్రీ సంఘం షాద్‌నగర్‌ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శంకర్‌ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానిని ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తాపీ మేస్త్రీ సంఘం భవన నిర్మాణానికి త్వరలో స్థలం సమకూర్చి, భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్‌ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాపీ మేస్త్రీలు చేసిన కృషి మరువలేనిది అన్నారు. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్‌, చెన్నయ్య, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌ యాదవ్‌, బాలరాజు, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు ఘన సన్మానం**

షాద్‌నగర్‌ ముదిరాజ్‌ మహాసభ నాయకులు సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. ఈసందర్భంగా వీర్లపల్లి శంకర్‌కు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం తాలుకా అధ్యక్షుడు అంచ రాములు, శ్రీధర్‌ వర్మ, గిరిబాబు, అశోక్‌, మధు, వాసు, అజయ్‌వర్మ, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

## ‘యంత్రలక్ష్మి’ ఎక్కడమ్మా..!

- అటకెక్కిన వ్యవసాయ పనిముట్ల సబ్సిడీ
- రైతులకు అందని రాయితీ ట్రాక్టర్లు
- రోజురోజుకు పెరుగుతున్న కూలీల కొరత
- అన్నదాతపై ఆర్థికభారం



దౌల్తాబాద్‌: వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం అటకెక్కింది. ఆధునిక వ్యవసాయ పనిముట్లను రైతులందరికీ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పెట్టుబడులు తగ్గించి రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఈ పథకం ద్వారా ట్రాక్టర్లు, సాగు సామగ్రి, హార్వెస్టర్లు, వరినాటు యంత్రాలను 50 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకానికి సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,500కోట్ల నిధులను కేటాయిస్తున్నట్లు బడ్జెట్లో ప్రకటించినా ఇప్పటి వరకు యంత్రాలను సరఫరా చేయలేదు. మండలంలో 70 శాతంపైగా రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతి సీజన్‌లో యంత్రాలను పదుల సంఖ్యలో రైతులు కొనుగోలు చేస్తున్నారు. యంత్రలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించినా.. ఇప్పటివరకు యంత్రాల కొనుగోలులో రాయితీ ఇవ్వకపోవడం గమనార్హం. కూలీల కొరతతో యంత్రాల వినియోగం పెరిగింది. వరికోతలకు పూర్తిగా హార్వెస్టర్లను వాడుతున్నారు. మినీ ట్రాక్టర్లు, పవర్‌ టిల్లర్లు వినియోగం కూడా పెరిగింది. పంటల నూర్పిడి, మందుల పిచికారి, నేలను చదును చేయడంతో పాటు పలు రకాల వ్యవసాయ పనుల్లో యంత్రాలను విరివిగా వాడుతున్నారు.

**కాంగ్రెస్‌ ప్రభుత్వంపై ఆశలు**

వానాకాలం, యాసంగిలో యంత్రలక్ష్మి తదితర పథకాలకు ఇవ్వాల్సిన సబ్సిడీ ఊసేలేదు. దీంతో యంత్రాలను బయటి మార్కెట్లో పూర్తిగా చెల్లించి రైతులు కొంటున్నారు. రైతుకిసాన్‌ యోజన, ఉద్యానశాఖ ద్వారా ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు మంజూరు కాలేదు. కల్టివేటర్‌, రోటోవేటర్‌ నేలను దున్నడం, దమ్ముచేయడం సరుకుల రవాణా తదితర పనులకు ట్రాక్టర్‌ల వినియోగం తప్పనిసరి మారింది. గతంలో పోలిస్తే అన్ని పంటల సాగు విస్తీర్ణం నాలుగింతలు పెరిగింది. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో యంత్రాల్లేనిదే సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కూలీలు దొరకకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్న విషయం తెలిసిందే. దీంతో ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం పెరిగింది. చిన్న, సన్నకారు రైతులు లక్షలు వెచ్చించి యంత్రాల కొనుగోలు చేసే శక్తి లేకపోవడంతో పొలం పనుల సాయం కోసం పెద్ద రైతులను ఆశ్రయిస్తున్నారు. పెద్ద రైతుల నుంచి యంత్రాలను అద్దెకు తీసుకోవడంతో భారం పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్‌ ప్రభుత్వంపై అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### ‘ఉత్తమ’ సేవకులు

అనంతగిరి: వికారాబాద్‌ జిల్లా ఏఆర్‌ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్‌ కానిస్టేబుల్‌ హన్మీరెడ్డి, మడపతి శ్రీశైలం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ సేవాపతకాలకు ఎంపికయ్యారు. వీరు త్వరలో పోలీసు ఉన్నతాధికారుల చేతుల మీదుగా అందుకోనున్నారు. విధుల్లో ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనలు పాటించడంతో వీరిని ఎంపిక చేశారు.

## వెల్‌డన్‌ తాండూరు టీమ్‌

- పోలీస్‌ అధికారులను అభినందించిన ఎస్పీ కోటిరెడ్డి
- ఎస్పీ కార్యాలయంలో న్యూ ఇయర్‌ వేడుకలు

తాండూరు: తాండూరు సబ్‌ డివిజన్‌ పోలీసు అధికారుల పనితీరు అభినందనీయమని జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి కొనియాడారు. సోమవారం తాండూరు డీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి రూరల్‌ సీఐ రాంబాబు, ఎస్‌ఐలు ఎస్పీ కార్యాలయంలో కోటిరెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబ్‌ డివిజన్‌ పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ కేక్‌ కట్‌ చేశారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నేరాల క్రైమ్‌రేట్‌ తగ్గించడం, అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంతో సబ్‌ డివిజన్‌ అధికారులను అభినందించారు. ఎస్పీని కలిసిన వారిలో తాండూరు పట్టణం, కరన్‌కోట్‌, పెద్దేముల్‌, యాలాల, బషీరాబాద్‌ ఠాణాల ఎస్‌ఐలు ఉన్నారు.

# పన్నుల వసూలుపై నజర్‌

**టార్గెట్‌ రూ.1.37 కోట్లు**

- వసూలైనవి రూ.60లక్షలు
- మార్చి 15లోగా వందశాతం పూర్తి చేసేందుకు కసరత్తు
- పంచాయతీల మెడపై విద్యుత్‌ బిల్లుల కత్తి



గడ్డమల్లయ్యగూడ పంచాయతీ కార్యాలయం

యాచారం: పన్నుల వసూళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే పన్నులతోనే గ్రామాల్లోని సమస్యల పరిష్కారం, సిబ్బందికి జీతాలు, వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మండల పరిధిలోని 24 పంచాయతీల్లో ఒక్కో పంచాయతీల్లో పన్నుల టార్గెట్‌ రూ.లక్ష నుంచి రూ.10 లక్షలకు పైగానే ఉంది. 2023–24కు సంబంధించి రెండు నెలల క్రితమే పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి పన్నుల నోటీసులు పంపిణీ చేశారు. నూతన పంచాయతీ రాజ్‌ యాక్ట్‌ ప్రకారం ప్రతీ ఏడాది డిసెంబర్‌ లోపే గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉంది. డిసెంబర్‌లో వసూలయ్యే పన్నులపై ఆధారపడే ఈ ఏడాది ఖర్చులకు సంబంధించి ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. పంచాయతీల్లో మార్చి 31 వరకు వంద శాతం పన్నుల టార్గెట్‌గా నిర్ణయించుకుని వసూళ్లకు కృషి చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరమే పన్నుల వసూళ్లపై ప్రాముఖ్యత ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో వసూలయ్యే పన్నులతోనే పరిపాలన సాగుతోంది. పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు అందిస్తున్నారు.

**మేజర్‌ గ్రామాల్లో విస్తరిస్తున్న వ్యాపారం**

మండలంలోని మేజర్‌ గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్ల శాతం గణనీయంగా పెరిగింది. యాచారం, గునుగల్‌, నందివనపర్తి, తక్కళ్లపల్లి, చింతపట్ల, మాల్‌, నక్కర్తమేడిపల్లి, నస్దిక్‌సింగారం, చింతుల్ల, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. దీంతో నిర్మాణాలు పెరగి పన్నుల శాతం గణనీయంగా పెరుగుతుంది. నందివనపర్తి గ్రామంలో గంటా కంపెనీ, గునుగల్‌ గ్రామంలో తిరుమల డెయిరీ, యాచారం గ్రామంలో రైలు మిల్లులు, మాల్‌, యాచారం గ్రామాల్లో వ్యాపార దుకాణాలు, హోటళ్లు నిర్మితమయ్యాయి. గ్రామాల్లోనూ ఇళ్ల నిర్మాణాలు పెరగాయి. నక్కర్తమేడిపల్లి, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో పౌల్ట్రీఫాంలు వెలుస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో పరిశ్రమలు, నిర్మాణాలు పెరుగుతున్నా ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో ఏర్పాటవుతున్నా పరిశ్రమలకు సరైన మెజర్‌మెంట్‌ చేయకపోవడం, వ్యాపారులతో కుమ్మక్కు కావడంతో పంచాయతీలకు వచ్చే ఆదాయం ప్రజాప్రతినిధులు జేబులోకి వెళ్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహణకు యత్నం**

2023–24 ఏడాదికి రూ.1,37,86,386 పన్నుల టార్గెట్‌ ఉండగా రూ.60,00,259 పన్నులు వసూలయ్యాయి. మేజర్‌ గ్రామాలైన మాల్‌, నందివనపర్తి, యాచారం, గునుగల్‌, మాల్‌, చింతపట్ల, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో పన్నుల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. మార్చి 30లోపు వంద శాతం పన్నులు వసూళ్లు చేసేందుకు ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ ఉమారాణి పర్యవేక్షిస్తున్నారు. పన్నుల వసూళ్లు, చెల్లింపులపై ప్రజాప్రతినిధులు, ప్రజలతో సమావేశమవుతూ చైతన్యం చేస్తున్నారు. ఇందుకు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు, ప్రజా పాలన తదితర ప్రభుత్వ కార్యక్రమాలతో పంచాయతీ సిబ్బంది బిజీగా ఉండడంతో పన్నుల వసూళ్లపై దృష్టి సారించలేకపోతున్నారు.

**పేరుకుపోతున్న విద్యుత్‌ బకాయిలు**

కేసీఆర్‌ సర్కార్‌ హయాంలో ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు ఎటువంటి నిధులు మంజూరవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ ఆర్థిక పద్దుల నిధులతోనే పంచాయతీల నిర్వాహణ కొనసాగుతోంది. పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు అప్పట్లో బీఆర్‌ఎస్‌ సర్కార్‌లోని మంత్రులను, కలెక్టర్లను కోరిన స్పందన కరువైంది. పంచాయతీల్లో విద్యుత్‌ లైట్లు, బోరు మోటార్లు వినియోగానికి రూ.వేలల్లో విద్యుత్‌ బాకాయిలుంటున్నాయి. 2023కు గాను రూ. 57,30,265 బిల్లులు వచ్చాయి.

**రూ.10 లక్షల అప్పు**



గ్రామంలో వివిధ అభివద్ధి పనులకు, సిబ్బంది జీతాలకు రూ.10లక్షలు అప్పు చేశా. ఏడాది నుంచి పంచాయతీకి పైసా నిధులు రాలే. పంచాయతీ నిర్వాహణ భారంగా మారింది. పన్నులు వసూలు చేస్తేనే సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి ఉంది. కొత్త ప్రభుత్వమైనా పెండింగ్‌ నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి. పదవీ కాలం ముగిసే వరకైనా వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నాం.

– కాలె సంతోష, సర్పంచ్‌, తమ్మలోనిగూడ

**విద్యుత్‌ బిల్లులు మాఫీ చేయాలి**



పంచాయతీల్లో విద్యుత్‌ బిల్లులు, బోరుమోటార్ల వాడకం కోసం ఖర్చు అయ్యే విద్యుత్‌ వినియోగానికి సంబంధించి బిల్లులను ప్రభుత్వమే భరించాలి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధుల ద్వారా పంచాయతీల నిర్వాహణ కొసాగుతుంది. నెలకు రూ.50వేలకు పైగా విద్యుత్‌ బిల్లు వస్తుంది. చెల్లించేది ఎలా. నిధులు రావు. చెల్లింపులు అధికం కావడంతో నిర్వాహణ భారంగా మారింది.

– ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌, యాచారం

**పన్నులు వసూలు చేయాలి**



మార్చి 15 లోపే వంద శాతం పన్నులు వసూలు చేయాలి. కొత్త పంచాయతీ రాజ్‌ చట్టం ప్రకారం డిసెంబర్‌ లోపే వంద శాతం పన్నులు వసూల చేయాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికలు, ప్రజాపాలన తదితర ప్రభుత్వ కార్యక్రమాల వల్ల పన్నుల వసూళ్లపై పూర్తి స్థాయి దృష్టి పెట్టలేకపోతున్నాం. విద్యుత్‌ బిల్లులు మాఫీపై ప్రభుత్వానికి తెలియజేస్తాం. నిధులు ఉన్న పంచాయతీలు విద్యుత్‌ బిల్లులు చెల్లిస్తేనే మంచిది.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ, యాచారం

## విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్సీ ఏవీఎన్‌ రెడ్డితో తపస్‌ ఉపాధ్యాయ సంఘం నాయకులు

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌ రెడ్డికి ‘తపస్‌’ విజ్ఞప్తి**

చేవెళ్ల: పాఠశాలలో ఉపాధ్యాయుల, స్కావేంజర్‌ నియామకం, జీఓ 317 సమస్యలను పరిష్కరించాలని తపస్‌ జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎమ్మెల్సీ ఏవీఎన్‌ రెడ్డిని కోరారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయనను కలిసిన తపస్‌ జిల్లా సంఘం నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. జీఓ 317, పాఠశాల్లో స్కావెంజర్‌ నియామకం గురించి, గత ప్రభుత్వం జారీ చేసిన హెల్త్‌కార్డ్స్‌ జీఓను అమలు, ఎఫ్‌ఆర్‌ఎస్‌ విధానం వలన రోజు విద్యార్థుల ఫొటోలు తీయడం ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారిందని దీనిని రద్దు చేయాలని, ఎఫ్‌ఎల్‌ఎన్‌ ఉన్నతి తొలగించుట తదితర అంశాలను ఆయనతో చర్చించారు. కౌన్సిల్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుటకు కృషి చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఘనపురం సురధీర్‌, జిల్లా అధ్యక్షుడు కాశీరావు, ప్రధాన కార్యదర్శి రమేశ్‌, జిల్లా కోశాధికారి దూత కృష్ణ, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, చేవెళ్ల మోడల్‌ స్కూల్‌ ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాదవ్‌, జిల్లా కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మర్పల్లి: రోడ్డు ప్రమాదంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మర్పల్లి పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామానికి చెందిన చాకలి బాబు (32) ఆదివారం రాత్రి వ్యక్తిగత పనుల నిమిత్తం మోమిన్‌పేట్‌కు వెళ్లాడు. పనులు ముగించుకొని కాలినడకన ఇంటికి బయలుదేరాడు. మర్పల్లి రైల్వే గేట్‌ దాటిన తరువాత బాబును వెనుక నుంచి వస్తున్న బైక్‌ ఢీ కొట్టింది. ప్రమాదంలో గాయపడిన బాధితుడిని స్థానికులు మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాబు మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి బాబు మృతదేహాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మర్పల్లి ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.